సాక్షి
తూర్పుగోదావరి
గురువారం | 16 నవంబర్ | 2023



అన్నదాన భవనానికి వితరణ


ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయంలో నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణానికి కొవ్వూరు శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి దంపతులు (విశాఖపట్నం) రూ.50,116 అందించారు.



అన్నదానానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కె.రవిశంకర్(రాజమహేంద్రవరం) రూ.లక్ష విరాళాన్ని ఆలయ చైర్మన్ రోహిత్, ఈఓ అజాద్‌కు బుధవారం అందజేశారు.

డెల్టా కాలువలకు నీరు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 1,600,మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటి మట్టం చేరింది.

న్యూస్‌రీల్

రూ. 2 కోట్లతో బ్యారేజీ రోడ్డు అభివృద్ధి

రాజమహేంద్రవరం సిటీ: ధవళేశ్వరం బ్యారేజీ రోడ్డును రూ.2 కోట్లతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేశారన్నారు. మొత్తం 6.8 కిలోమీటర్ల రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నామన్నారు. ప్రస్తుతం టెండర్ ప్రక్రియ ప్రారంభించామని, 15 రోజుల్లో పనులు ప్రారంభించి నెల రోజుల వ్యవధిలో పూర్తి చేస్తామన్నారు. రహదారిపై ఉన్న తారు రోడ్డును తొలగించేందుకు ప్రత్యేక యంత్రాలను వినియోగిస్తామని, దానికి ఎక్కువ సమయం పడుతుందన్నారు. ఆ పని పూర్తయిన తర్వాత రహదారి నిర్మాణం జరుగుతుందన్నారు. బ్యారేజీ రోడ్డు పనులు పూర్తయ్యే వరకూ రోడ్ కం రైల్ వంతెన, గామన్ బ్రిడ్జి మీదుగా ప్రజలు ప్రయాణాలు కొనసాగించాలన్నారు. సంక్రాంతికి ముందే ధవళేశ్వరం బ్యారేజీ రోడ్డును అందుబాటులో తీసుకువస్తామన్నారు.

కోదండరాముడికి వెండి మకరతోరణం



వెండి మకరతోరణం సమర్పిస్తున్న దాతలు మాధవరపు సూర్యచంద్రం, అనంతలక్ష్మి దంపతులు

దేవరపల్లి: స్థానిక మెరకవీధిలో ఉన్న కోదండ రాముడికి రూ.1.50 లక్షల విలువ గల వెండి మకరతోరణాన్ని మాధవరపు సూర్యచంద్రం, అనంతలక్ష్మి దంపతులు, కుమారుడు వెంకటేశ్వరరావు, సుజాత దంపతులు బుధవారం సమర్పించారు. ఈ సందర్భంగా దాత సూర్యచంద్రం మాట్లాడుతూ ఆలయానికి రూ.1 లక్ష వ్యయంతో రథం అందజేసినట్టు ఆయన చెప్పారు. రూ.1.50 లక్షల వ్యయంతో ఆలయం చుట్టూ రేకుల పందిరి నిర్మాణం చేసినట్టు ఆయన చెప్పారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానన్నారు. ఆలయ కమిటీ సభ్యులు తీగెల బలరామయ్య, గ్రాస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో ఓటు లేని వారిని గుర్తించి, నమోదు చేసే ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలు తమ వంతు పాత్ర పోషించాలని కలెక్టర్ మాధవీలత కోరారు. డీఆర్వో నరసింహులుతో కలిసి బుధవారం కలెక్టర్ చాంబర్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితాల సవరణ, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ప్రతివారం జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటరు జాబితా సవరణకు సంబంధించి మార్పులు, చేర్పులు, తొలగింపు, అభ్యంతరాల కోసం అందిన దరఖాస్తుల పరిష్కార ప్రగతిని వివరించడం జరుగుతోందన్నారు. 2024 ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియలో భాగంగా గత నెల 27న జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించడం జరిగిందని, డిసెంబర్ 9 వరకు ముసాయిదా జాబితాలపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. అందిన దరఖాస్తులను డిసెంబర్ 26వ తేదీ నాటికి పరిష్కరించి, 2024 జనవరి 5న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామన్నారు. బూత్ స్థాయిలో ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల కోసం డిసెంబర్ 2, 3 తేదీల్లో మరోమారు ప్రత్యేక క్యాంపెయిన్ చేపడతామన్నామని ప్రకటించారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: కార్తికమాసం సందర్భంగా రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి మొదలైంది. బుధవారం ఉదయం నుంచి భక్తులు సత్యదేవుని సన్నిధికి తండోపతండాలుగా తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రతమండపాలు, క్యూ లైన్లు నిండిపోయాయి. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. వృద్ధులు, వికలాంగులు, నేలమీద కూర్చుని వ్రతాలాచరించలేని వారి కోసం బల్లలు ఏర్పాటు చేశారు. స్వామివారి నిత్య కల్యాణంలో 30 మంది రూ.1,116 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి పాల్గొన్నారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు సత్యదేవుని నిజరూపదర్శనం

సత్యదేవుడు, అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారు, శంకరుడు గురువారం నిజరూప దర్శనం ఇవ్వనున్నారు. పుష్పమాలలు, అవసరమైన వస్త్రాలు మినహా ఏ విధమైన ఆభరణాలను స్వామి, అమ్మవార్లకు అలంకరించరు. ఉదయం నుంచి మధ్యాహ్నం నివేదన వరకు నిజరూప దర్శనం కొనసాగుతుంది.

రబీకి సమృద్ధిగా సాగునీరు

- కొరత ఉన్నా పూర్తిస్థాయిలో అందించేందుకు కార్యాచరణ
- సాగునీటి ఆవశ్యకత 91.35 టీఎంసీలు
- అందుబాటులో 82.49 టీఎంసీలు
- ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమకూర్చేందుకు ప్రణాళిక
- జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో నిర్ణయం



నీరు పారుదల సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణు, చిత్రంలో హోం మంత్రి వనిత, ఎంపీ భరత్ రామ్, జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణరెడ్డి

సాక్షి, రాజమహేంద్రవరం: గోదావరి డెల్టాలో రబీ ఆయకట్టుకు అత్యంత ప్రాధాన్యముంది. తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల పరిధిలో విస్తరించి ఉండటమే ఇందుకు కారణం. అంతటి ప్రాధాన్యాన్ని సంతరించుకున్న రబీ సాగుకు సంవృద్ధిగా సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది. వర్షాభావ పరిస్థితులతో గోదావరిలో ఇన్‌ఫ్లో తక్కువగా ఉంది. ఈ పరిణామం రబీ పంటల సాగుపై చూపే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా, ఏ ఒక్క రైతూ నీటి కొరత కారణంగా నష్టపోకూడదన్న మహోన్నత ఆశయంతో చర్యలు చేపడుతోంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న నీటితో పాటు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సేకరించి అందించేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొందించింది. రబీకి అవసరమైన సాగునీరు (డిసెంబర్ 23 నుంచి మార్చి 24 వరకూ) సరఫరా కార్యాచరణ ప్రణాళికపై బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి నీటి పారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కె.మాధవీలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై మంత్రులు, ఎంపీ, జెడ్పీ చైర్మన్, అధికారులు చర్చించారు.

8,96,507 ఎకరాల రబీ ఆయకట్టు

గోదావరి డెల్టా పరిధిలో 8,96,507 ఎకరాల రబీ ఆయకట్టు ఉంది. తూర్పు డెల్టా పరిధిలో 2,64,507 ఎకరాలు, సెంట్రల్ డెల్టాలో 1,72,000 ఎకరాలు, వెస్ట్రన్ డెల్టా కింద 4,60,000 ఎకరాలు విస్తరించింది. వీటిలో పంటల సాగుకు 91.35 టీఎంసీల సాగునీటి ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం 82.49 టీఎంసీలు అందుబాటులో ఉంది. దీంతో 8.86 టీఎంసీల నీటి కొరత ఏర్పడుతుందని అంచనా వేస్తున్నారు. వాటిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. టర్న్ సిస్టం(వారబందీ) ద్వారా నీటిని పొదుపు చేసి 5 టీఎంసీలు, కాలువలపై క్రాస్ బండ్‌ల ఏర్పాటు, డీజిల్ పంపుల వినియోగించి నీటిని ఎత్తి వేయడం లాంటి పద్ధతులతో 3.86 టీఎంసీల నీటిని సమకూర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ అంశంపై జిల్లా మంత్రులు, ఎంపీ, కలెక్టర్ ఏ మన్నారంటే..

ప్రతి నీటి బొట్టు వినియోగం

తానేటి వనిత, హోం మంత్రి

నీటి లభ్యత తక్కువగా ఉన్న దృష్ట్యా ప్రతి నీటి బొట్టు వినియోగించుకోవాలి. ప్రతి నియోజకవర్గ పరిధిలో ఆయకట్టుకు సాగునీరు అందించే సామర్థ్యం పెంచుకోవాలి. గత సీజన్‌లో మాదిరి ప్రస్తుతం కూడా రైతులకు సకాలంలో నీరు అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. రైతు సంక్షేమ ప్రభుత్వ విధానంలో రైతు స్నేహపూర్వక విధానం అమలు చేయడం జరుగుతోంది.

సాగునీటి వనరులపై చర్చ:
కె.మాధవీలత, కలెక్టర్

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రానున్న రబీ సీజన్‌లో సాగునీటి వనరులపై చర్చించాం. అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను ఎలా వినియోగించాలి, తద్వారా రబీ సాగుకు సమర్థంగా ఎలా అందించాలి? అన్న అంశాలపై చర్చించాం. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. పోలవరం ప్రాజెక్టు వద్ద నీటి నిల్వ చేయడం, మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం రెండుసార్లు (నవంబర్ నెలాఖరు, డిసెంబర్ రెండో వారం) నిర్వహించి డిసెంబర్‌లో నాట్లు పూర్తి చేసేలా అవగాహన కల్పించడంపై తీర్మానం చేశాం. లిఫ్ట్ ఇరిగేషన్ కింద మోటార్ల మరమ్మతులు, క్రాస్ బండ్ ఏర్పాట్లు, డీ సిల్టింగ్, డీ వీడింగ్, స్లూయిస్ తదితర 20 పనులకు రూ.103.69 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. కాగా.. సమావేశంలో ఎంపీ మార్గాని భరత్ రామ్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణ రెడ్డి, రైతు ప్రతినిధులు పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకవచ్చారు. జేసీ తేజ్ భరత్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, రైతు ప్రతినిధులు, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు

- నవంబర్ 30వ తేదీలోగా ఖరీఫ్ పంట కోతలు పూర్తి చేయాలి.
- రబీ నాట్లను ముమ్మరం చేసేలా డిసెంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు రైతులకు అవగాహన కల్పించడం.
- డిసెంబర్ 31 నాటికి రబీ సీజన్ నాట్లు పూర్తి చేయాలి.
- వరికి ప్రత్యామ్నాయంగా మినుములు సాగు చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తారు.

రైతు పక్షపాత ప్రభుత్వం

చెల్లుబోయిన వేణు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్లో వరికి అనుకూలంగా ఉన్న 64,361 ఎకరాలకు సాగునీరు అందిస్తాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తాం. అందుకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటాం. నవంబర్ నెలాఖరు నాటికి ఖరీఫ్ కోతలు పూర్తి చేసి, డిసెంబర్ 1 నుంచి 10 లోగా రబీ సీజన్ నాట్లు కోసం రైతులు సిద్ధంగా ఉండాలి. అప్పుడే డిసెంబర్ 31వ తేదీ నాటికి నాట్లు పూర్తి చేయగలం. ఖరీఫ్‌లో ఆలస్యంగా పంట వేసిన వారిని రబీకి త్వరతగతిన సిద్ధం చేయాల్సిన చర్యలపై సమావేశంలో తీర్మానం చేశాము. పోలవరం ప్రాజెక్టు కింద రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి నిల్వ ఏ విధంగా ఉంచాలనే అంశం చర్చించి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ప్రతిపాదించాము. రబీ పంట పండిస్తామా ? లేదా? అనే ఆందోళనలో ఉన్న పచ్చ పత్రికల్లో కథనాలు, ప్రతి పక్షాల ఆరోపణలకు ఫుల్ స్టాప్ పెడుతూ సాగునీరు అందించే దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ మేరకు ముఖ్యమంత్రికి రైతుల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నాం.

సామాజిక సాధికార జాతర



కొత్తపేటలో బస్‌యాత్ర ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: గత నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, అన్ని వర్గాలకు చేసిన సామాజిక సమన్యాయం గురించి ప్రజలకు వివరించేందుకు గురువారం మధ్యాహ్నం కొత్తపేట నియోజకవర్గంలో సామాజిక సాధికారత బస్సు యాత్ర జరగబోతోంది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో యాత్ర ప్రారంభమై నియోజకవర్గ కేంద్రం కొత్తపేట చేరుకుంటుంది. అక్కడ భారీ బహిరంగ సభ జరగనుంది.

పాల్గొననున్న ప్రముఖులు

కొత్తపేటలో జరిగే బహిరంగ సభలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి వెంకటనాగేశ్వరరావు, ఎంపీలు మిధున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, చింతా అనూరాధ, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, జిల్లా, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, పండుల రవీంద్రబాబు, బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, జక్కంపూడి రాజా, రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, సామాజిక వర్గాల నాయకులు పాల్గొంటారు.

బస్‌యాత్రకు భారీ ఏర్పాట్లు

సామాజిక సాధికారత బస్సు యాత్రకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. రావులపాలెం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల గ్రౌండ్ నుంచి బస్ యాత్రతో పాటు దానికి ముందు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ సాగనుంది. కళాశాల వద్ద బస్‌కు క్రేన్‌తో భారీ గజమాల, కోనసీమ ముఖద్వారం వద్ద 500 కొబ్బరి బొండాలతో ఏర్పాటు చేసిన దండను రెండు క్రేన్‌ల సాయంతో వేయనున్నారు. రావులపాలెం హైస్కూల్ సెంటర్ నుంచి కొత్తపేట వరకూ ఐదు చోట్ల భారీ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలుంటే చెప్పండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: ప్రాధాన్యత భవనాలు, ఇళ్ల నిర్మాణంపై క్షేత్రస్థాయిలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని రావాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం పంచాయతీ రాజ్, హౌసింగ్ పనితీరుపై క్షేత్రస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రాధాన్యత భవనాలు పురోగతి సాధించడంలో క్షేత్ర స్థాయి అధికారుల తొలిదశ పనితీరు అభినందనీయమన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇస్తున్న లక్ష్య సాధనలో కొంత మేర ప్రగతి చూపడంలో సరైన కార్యాచరణ ప్రణాళిక అమలు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు వారాల లక్ష్యం పూర్తి చేయకపోవడంపై డివిజన్ల వారీగా సమీక్షించారు. డిసెంబర్ 10వ తేదీ నాటికి 206 భవనాలు అప్పగించాలని, ఆమేరకు మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు నిర్మాణ పనులకు సంబంధించి రెండో దశలో 19,253 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భాను ప్రకాష్, పి.సువర్ణ, పంచాయతీ రాజ్ ఎస్సీ ఏబీవీ ప్రసాద్, జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్ పాల్గొన్నారు.

ఖైదీల ఉపాధికి చక్కని మార్గం

మంత్రులు వనిత, వేణు గోపాలకృష్ణ



పెట్రోలు బంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణు, హోం మినిస్టర్ తానేటి వనిత, ఎంపీ భరత్‌రామ్ చిత్రంలో జైలు అధికారులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): సత్ప్రవర్తనతో ఉన్న ఖైదీల ఉపాధికి సెంట్రల్ జైలులో తీసుకుంటున్న చర్యలను హోం మినిస్టర్ తానేటి వనిత, బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ప్రశంసించారు. జైళ్లశాఖ డీఐజీ కార్యాలయం వెనుక రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న రీజినల్ ట్రైనింగ్ సెంటర్, కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద పెట్రోలు బంక్‌లకు వారు ఎంపీ భరత్‌రామ్‌తో కలసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ కోస్తాంధ్ర జైళ్లలో అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చేలా 60 ఎకరాల్లో ట్రైనింగ్ సెంటర్ నిర్మిస్తున్నారన్నారు. నిధులు చాలకపోతే రెండో దశలో మంజూరు చేస్తామన్నారు. ఖైదీలను అర్థం చేసుకునేలా సిబ్బందికి ఇందులో శిక్షణ ఇస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జైళ్ల శాఖలో 17 పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసి ఖైదీల ఉపాధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖైదీకి రోజుకు రూ.200 వస్తుందని, జైలు నుంచి విడుదలయ్యాక బయట పెట్రోలు బంక్‌లో పనిచేయడం వల్ల సుమారు నెలకు రూ.12 వేల వరకు సంపాదించవచ్చన్నారు. జైలు శాఖ కార్పస్ నిధులతో ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్ సంస్థల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు నిర్వహిస్తామన్నారు. బంక్ ఆదాయం కార్పస్ ఫండ్‌కు జమ చేయడంతో పాటు జైలు అభివృద్ధికి వినియోగిస్తారన్నారు. మంత్రి శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ఖైదీల జీవనోపాధికి ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయటం వల్ల విడుదలయ్యాక మంచి ఉద్యోగం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్(ఏపీ) శ్రీనివాసరావు, కోస్తాంధ్ర జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్, జైలు సూపరింటెండెంట్ ఎస్. రాహుల్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య భద్రతకు భరోసా

- ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం
- జిల్లాలో 441 వైద్యశిబిరాల నిర్వహణ
- 2,30,080 మందికి వైద్యసేవలు
- ఉచితంగా పరీక్షలు, మాత్రల పంపిణీ
- 1,503 మందికి ఆరోగ్యశ్రీ చికిత్స



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో సేవలు అందిస్తున్న డాక్టర్లు

రాజమహేంద్రవరం రూరల్: పేదల ఇంటి ముంగిటకే మెరుగైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించింది. మారుమూల గ్రామాలకు సైతం వైద్యులను పంపించి సేవలందించింది. ప్రతి ఇంటింటికీ సర్వే చేయించి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి గుర్తించి మరీ చికిత్స చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్యశిబిరాలను ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వారందరిని జగన్ ప్రభుత్వం ఆరోగ్య భరోసా కల్పించింది.

సెప్టెంబర్ 15న ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 15న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. 9,416 మంది వలంటీర్లు, 368 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 512 మంది ఏఎన్‌ఎంలు, 1,310 మంది ఆశా కార్యకర్తలు సుమారు 5,80,385 ఇళ్లకు వెళ్లి 14,34,609 మందిని ఆరోగ్య సర్వే చేశారు. స్మార్ట్‌ఫోన్ ఉన్నవారితో ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. అనుమానిత వ్యక్తులకు బీపీ, మధుమేహం వంటి ఏడు రకాల పరీక్షలను ఇంటి వద్దే చేయించారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి టోకెన్లు ఇచ్చి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు హాజరు కావాలని సూచించారు.

ముగిసిన వైద్యశిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 30వ తేదీన ప్రారంభమైన జిల్లాలో వైద్య శిబిరాలు బుధవారంతో ముగిశాయి. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అన్ని శాఖల అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుని ముందస్తు ప్రణాళికతో శిబిరాలను విజయవంతంగా నడిపించారు. ఇందుకు స్పెషలిస్టు డాక్టర్లతో పాటు 107 మంది ప్రభుత్వ వైద్యులను కేటాయించారు. వారు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా వైద్యసేవలను అందించారు. నిత్యం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వీటిని నిర్వహించారు. కార్పొరేట్ తరహాలో రోగుల వివరాలను పొందుపరచడం, వారికి ఫైల్స్ ఇవ్వడంతో పాటు చికిత్స అందించారు.

ఆరోగ్య భరోసా

జగనన్న ఆరోగ్య సురక్షతో పిల్లల నుంచి వృద్ధుల వరకూ భరోసా కలిగింది. ప్రభుత్వం వాడవాడలా శిబిరాలు ఏర్పాటు చేసి, మెరుగైన వైద్యం అందించడంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికంగా గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకున్నారు. కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు అందజేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేసి, శస్త్రచికిత్సలు చేయించారు. అర్హులైన వారికి వైఎస్సార్ ఆసరా కింద రూ.5 వేలు అందజేశారు.

పేదల ఆరోగ్యమే ధ్యేయం



పేదలకు అందని ద్రాక్షగా ఉన్న వైద్యసేవలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. కొత్త ఆలోచనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పల్లెలకు డాక్టర్లు రావడం ప్రజలు గొప్పవరంగా భావిస్తున్నారు. నెలన్నర రోజులపాటు వైద్యాధికారులతో ఇతరశాఖల అధికారులు సమన్వయంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను విజయవంతం చేశారు. జిల్లాలో 2.30 లక్షల మంది వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకున్నారు.

– డాక్టర్ కె.మాధవీలత, కలెక్టర్

ఇంటింటా ఆరోగ్య సర్వే



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, వైద్యసిబ్బంది సర్వే చేసి, అనారోగ్య సమస్యలున్న వారిని జల్లెడ పట్టారు. దీంతో పలు వ్యాధులు బయటపడ్డాయి. ప్రధానంగా బీపీ, మధుమేహం, కంటి సమస్యలు, టీబీ వ్యాధులు వెలుగులోకి వచ్చాయి. వారంతో ఇప్పుడు చికిత్స తీసుకునే పనిలో పడ్డారు. సకాలంలో తగిన వైద్యం చేసేందుకు ఈ సురక్ష తోడ్పడింది. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులకు వైద్యశిబిరాలు ఉపయోగకరంగా మారాయి.

– డాక్టర్ వసుంధర, ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వివరాలు

జిల్లాలో వైద్యశిబిరాలు	441
గ్రామీణ ప్రాంతాల్లో శిబిరాలు	368
పట్టణ ప్రాంతాల్లో శిబిరాలు	73
వినియోగించుకున్నవారు	2,30,080
మహిళలు	1,22,603
పురుషులు	1,07,427
కొత్తగా షుగర్ బాధితులు	6,970
కొత్త బీపీ బాధితులు	8,709
నేత్ర సమస్యలున్నవారు	36,883
కళ్లద్దాలు పొందినవారు	27,208
కంటి శస్త్రచికిత్సలు	2,777
రక్తహీనత ఉన్నవారు	32,811
టీబీ పరీక్షలు	17,868
కొత్తగా గుర్తించిన టీబీ బాధితులు	37
ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేసిన కేసులు	6,811
ఆరోగ్యశ్రీ సేవలు పొందిన వారు	1,503

క్లుప్తంగా

జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలకు మహి


ఎన్‌టీపీసీ సీజీఎం రాజేష్‌కుమార్ సిన్హా చేతుల మీదుగా నగదు బహుమతి అందుకుంటున్న మహి

పి.గన్నవరం: విద్యుత్, ఇంధన పొదుపుపై కేంద్ర ప్రభుత్వం విశాఖ ఎన్‌టీపీసీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చిత్ర లేఖనం పోటీల్లో పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లికి చెందిన అడబాల మహి తృతీయ స్థానం సాధించింది. దీంతో ఆమెను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మహికి ఎన్‌టీపీసీ సీజీఎం రాజేష్‌కుమార్ సిన్హా మంగళవారం రూ.22 వేల నగదు బహుమతిని అందజేశారు. ఆమె జవహర్ నవోదయలో 10వ తరగతి చదువుతోంది. మహి గతంలో కూడా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకుంది. జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రాష్ట్రపతి లేదా ప్రధాని చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి


మృతుడు వెంకటరమణ

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరం గ్రామంలో తేనెటీగల దాడిలో వ్యక్తి మృతిచెందాడు. గ్రామానికి చెందిన కోన వెంకటరమణ(54) మంగళవారం బహిర్భూమికి వెళ్లాడు. ఇంతలో తేనెటీగలు దాడిచేశాయి. మృతుడు అపస్మారక స్థితికి చేరుకోగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటరమణ బుధవారం మృతి చెందాడు.

బోటులో అగ్ని ప్రమాదం

కాట్రేనికోన: నిజాంపట్నం రేవులో బోటులో ఆయిల్ వేస్తున్న సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కొత్తపాలెంకు చెందిన మత్స్యకారులు గాయాలపాలయ్యారు. కాట్రేనికోన మండలం కొత్తపాలెంనకు చెందిన మత్స్యకారులు పెమ్మాడి కృష్ణ, బలసాడి వెంకటేష్ జీవనోపాధి కోసం నిజాంపట్నం వెళ్లారు. అక్కడ ఒప్పందం కుదుర్చుకుని బోటులపై సముద్రంలో చేపల వేటకు వెళుతున్నారు. ఆయిల్ వేస్తున్న సమయంలో అగ్నిప్రమాదం జరిగి బోటు దగ్ధమైంది. గాయపడినవారు నిజాంపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని బంధువులు తెలిపారు.

సంతోషమని పింఛన్

- అరకొర నుంచి.. ఆదుకునే స్థాయికి సామాజిక పెన్షన్లు
- పడిగాపుల నుంచి పండుటాకులకు ఉపశమనం
- ఠంచనుగా ఒకటో తేదీన ఇంటి వద్దనే అందజేత
- వచ్చే జనవరి నుంచి రూ.3 వేలకు చేరనున్న పింఛన్
- జిల్లాలో 2.45 లక్షల మంది లబ్ధిదారులు


పెన్షను ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తున్న వలంటీరు


ఆస్పత్రికి వెళ్లి పెన్షను అందజేస్తున్న వలంటీరు

రాయవరం: నాలుగున్నరేళ్ల క్రితం ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో పెన్షన్ దారుల జీవితాలకు భరోసా కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే పెన్షన్ సొమ్మును దశలవారీగా పెంచుతూ వచ్చారు. వచ్చే ఏడాది జనవరి నుంచి సామాజిక పెన్షన్ సొమ్మును మరో రూ.250 పెంచనున్నారు. తద్వారా పెన్షన్ రూ.3వేలకు చేరనుంది. సామాజిక పెన్షన్ల పంపిణీలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారు. గత తెలుగుదేశం పాలనలో ఇచ్చే అరకొర పెన్షన్ కోసం పంచాయతీల వద్ద పడిగాపుల కాసేవారు. ఆ పరిస్థితిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలగించింది. ఒకటో తేదీనే పండుటాకులకు ఇంటి వద్దనే పెన్షన్ సొమ్మును అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. మీకు నేనున్నాను..అనే భరోసాను సీఎం జగన్ చేతల ద్వారా కల్పించారు.

క్రమంగా పెంచుతూ..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసే సమయానికి రూ.1,000 పెన్షన్ ఇచ్చేవారు. పాదయాత్ర సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్‌ను దశల వారీగా రూ.3వేలు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీతో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఒకేసారి రూ.2వేలు చేసింది. ఇదిలా ఉంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రూ.2వేల పెన్షన్‌ను 2020 జనవరి నుంచి రూ.2,250కు పెంచారు. అనంతరం 2021 జూన్ నుంచి రూ.2,500కు పెంచారు. ఈ ఏడాది జనవరి నుంచి రూ.2,750కు పెంచారు. దీనివలన జిల్లాలో 1.98 లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లకు లబ్ధి చేకూరింది. ఈ పెంపుదల కారణంగా జిల్లాలో ప్రతి నెలా అదనంగా రూ.4.97 కోట్ల భారం పడింది. అయినప్పటికీ ప్రభుత్వం పెన్షన్‌దారుల సంక్షేమానికే కట్టుబడి ఉంది. వచ్చే ఏడాది జనవరి నుంచి సంక్రాంతి కానుకగా రూ.3వేలకు పెంచనున్నట్టు ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో సామాజిక పెన్షన్‌దారుల మోముల్లో సంతోషం తొణికిసలాడుతోంది.

ఇంటి వద్దకే...

గత ప్రభుత్వ పాలనలో పెన్షన్లు తీసుకోవాలంటే చిన్నపాటి యుద్ధం చేయాల్సి వచ్చేది. పంచాయతీ కార్యాలయాల వద్ద పింఛన్ల కోసం పండుటాకులు పడిగాపులు పడేవారు. పింఛన్ సొమ్ము ఎప్పుడిస్తారో తెలియక, రోజంతా తిండీ తిప్పలు లేకుండా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసే పరిస్థితి ఉండేది. గంటలు, రోజులు తరబడి పడిగాపులతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పెన్షన్ తీసుకోవడం కోసం వారు పడే బాధలు వర్ణనాతీతంగా ఉండేవి. ఈ పరిస్థితుల నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విముక్తి కలిగించింది. ఠంచనుగా పింఛన్ ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా ఇంటికే అందించే ఏర్పాట్లు చేసింది. వేకువజాము నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతోంది. ఇలా పెన్షన్ కోసం వేచి చూసే పరిస్థితి నుంచి ఇంటి వద్దకే సొమ్ము అందించే స్థాయికి పెన్షన్ విధానాన్ని జగన్ సర్కారు తీర్చిదిద్దిన విధానాన్ని విప్లవాత్మకమైన చర్యగా భావించవచ్చు.

దరఖాస్తు చేసుకుంటే చాలు..

గతంలో నూతనంగా పెన్షన్‌కు దరఖాస్తు చేయాలంటే ప్రహసనంగా ఉండేది. కొత్త పెన్షన్ మంజూరు కావాలంటే ఆ గ్రామంలో లబ్ధిపొందుతున్న వారు మరణిస్తే ఆ స్థానంలో కొత్తవారికి పెన్షన్ వచ్చేది. ఈ పద్ధతికి స్వస్తి పలికి అర్హులు ఎవరు దరఖాస్తు చేసుకున్నా వారికి పెన్షన్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే మిగిలిన ప్రక్రియలు పూర్తి చేసి త్వరితగతిన అర్హుల జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి కొత్తగా 8,298 మందికి పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసింది. వీరి కోసం ప్రతి నెలా అదనంగా రూ.2.28 కోట్లు వెచ్చిస్తోంది.

పరిస్థితి ఇదీ..

కోనసీమ జిల్లాలో ప్రతి నెలా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, అభయహస్తం, చేనేత, డీఎంహెచ్‌వో, డప్పు కళాకారులు, చర్మకారులు, డయాలసిస్ (ప్రైవేట్), డయాలసిస్ (ప్రభుత్వ), కళాకారులు, ట్రాన్స్‌జెండర్లకు పింఛన్లను ప్రభుత్వం అందజేస్తోంది. నవంబర్ నెలలో 2,45,213 మందికి రూ.66,42,25,750 ప్రభుత్వం మంజూరు చేసింది.

మా కష్టాలు తెలుసుకుని..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కష్టాలు తెలుసుకుని పెన్షన్ పెంచుతున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి రూ.2,750 ఇస్తున్నారు. పెన్షన్‌పైనే ఆధారపడే కుటుంబాలకు సంతోషకరం. వచ్చే ఏడాది జనవరి నుంచి పెన్షన్ పెంచడం మాలాంటి వారికి ఎంతో మేలు చేకూరుస్తుంది.

– ఆంద్ర మల్లేశ్వరరావు, పెన్షన్‌దారుడు, రాయవరం

మాట నిలుపుకున్నారు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచి ఇస్తున్నారు. ఇప్పటికే మూడు సార్లు రూ.250 వంతున పెంచారు. వచ్చే ఏడాది కొత్త సంవత్సరం కానుకగా మరో రూ.250 పెంచుతానని చెప్పడం ఆనందంగా ఉంది. మా వృద్ధుల కష్టాలు తెలుసుకుని ఇంటి వద్దకే పెన్షన్ తెచ్చి ఇస్తున్నారు.

– ఆకుల అప్పాయమ్మ, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

విదేశాలకు పూతరేకుల ఎగుమతులను ప్రోత్సహించాలి

- మంత్రి అమర్నాథ్‌కు ఎంఆర్ఆర్ ఫుడ్స్ అధినేత రామరాజు వినతి
- అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి హామీ



ఢిల్లీలో పూతరేకుల స్టాల్‌ను సందర్శించిన మంత్రి అమర్నాథ్

ఆత్రేయపురం: ఇతర దేశాలకు నాణ్యమైన పూతరేకులు ఎగుమతి చేసేందుకు అవసరమైన చేయూత అందిస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ హామీ ఇచ్చారు. ఆత్రేయపురం పూతరేకుల కీర్తిని చాటి చెప్పేలా ఢిల్లీ ప్రగతి మైదానంలో ఎంఆర్ఆర్ ఫుడ్స్ అధినేత ముదునూరి రామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోఆర్డినేటర్ రాజీవ్‌వర్మ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫేర్ స్టాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్రేయపురం పూతరేకుల స్టాల్‌ను మంత్రి అమర్నాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా రామరాజు పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రపంచ దేశాల్లో పూతరేకులకు మంచి డిమాండ్ ఉందన్నారు. దేశ కీర్తిని, రాష్ట్ర ప్రతిష్టను పెంచేలా ఆత్రేయపురం పూతరేకులు ప్రధాన ప్రాత పోషిస్తున్నాయని అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తమకు సహకారం అందించాలని కోరారు. అవసరమైన మెషినరీ, ఇతర సదుపాయాలు అందించాలని, తద్వారా ఎగుమతులు పెరిగే అవకాశం ఉందని మంత్రికి రామరాజు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీలో ఫుడ్‌స్టాల్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌కు పూతరేకులను పరిచయం చేయడం హర్షణీయం అన్నారు. భౌగోళిక గుర్తింపు(జియో గ్రాఫికల్ ఐడెంటిటీ)తో ఆత్రేయపురం కీర్తి జాతీయ స్థాయికి చేరింది. దీంతో విశాఖపట్నం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం ప్రాంగణంలో ఆత్రేయపురం పూతరేకులకు గ్లోబల్ ఇండికేషన్ ట్యాగ్ సర్టిఫికేషన్ ప్రదానం చేసిన విషయం విదితమే.

యువమోర్చా ఇన్‌చార్జిగా కొండ


నాగసుధా కొండ

అమలాపురం రూరల్: తూర్పుగోదావరి జిల్లా యువమోర్చా ఇన్‌చార్జ్‌గా అమలాపురానికి చెందిన యల్లమిల్లి నాగసుధా కొండను నియమించారు. భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ రాష్ట్ర పదాధికారులకు ఈ బాధ్యత అప్పగించారు. రాష్ట్ర ఆర్‌టీఐ సెల్ కన్వీనర్‌గా ఉన్న యల్లమిల్లి నాగ సుధా కొండలరావును తూర్పు గోదావరి జిల్లాకి ఇన్‌చార్జిగా నియమించారు. నియామక పత్రాన్ని భారతీయ జనతా యువమోర్చ జాతీయ కార్యదర్శి వినీత్ త్యాగి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిత్రా శివన్నారాయణ, జాతీయ యువమోర్చ కార్యవర్గ సభ్యుడు ఉప్పిలి వంశీ చేతుల మీదుగా కొండ అందుకున్నారు. పార్టీలో సీనియర్‌గా కొండ సేవలను గుర్తించి ఈ పదవిని ఇచ్చారు. గతంలో యువమోర్చ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనరల్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, కవితల పోటీ కో కన్వీనర్‌గా ఆయన పనిచేశారు.

డ్వాక్రా మహిళకు బ్యాంకులో టోకరా

- రూ.28,600 సొమ్ము స్వాహా
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం


తుని బ్యాంకులో డ్వాక్రా మహిళను మోసగించిన అపరిచిత వ్యక్తి చిత్రం

తుని: బ్యాంకుకు డ్వాక్రా సొమ్మును కట్టడానికి వెళ్లిన మహిళను అపరిచిత వ్యక్తి మోసం చేసి రూ.28,600 స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితరాలు నూకరత్నం చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పార్కుసెంటర్ రోడ్డులో ఉన్న చైతన్య గోదావరి బ్యాంకుకు సెప్టెంబర్ 7వ తేదీన ఆమె వెళ్లింది. బ్యాంకుకు సొమ్ము చెల్లించేందుకు సేవింగ్ ఫారం పూర్తి చేయడం తెలియక పోవడంతో అక్కడే ఉన్న వ్యక్తిని ఆశ్రయించింది. ఆ అపరిచిత వ్యక్తి ఆమె నుంచి రూ.28,600 తీసుకుని ఒక ఫారంలో రూ.27,500, మరో ఫారంలో రూ.1,100 నమోదుచేసి బ్యాంకుకు చెల్లించినట్టు నటించి, వాటిపై బ్యాంకు సీల్ వేసి నూకరత్నంకు ఇచ్చాడు. ఆమె ఇంటికి వెళ్లి పోయింది. డ్వాక్రా రుణానికి సంబంధించి సొమ్ము చెల్లించడంతో గ్రూపు సభ్యులతో కలిసి బుధవారం బ్యాంకుకు వచ్చింది. బ్యాంకు సిబ్బందిని సంప్రదించి తమకు మళ్లీ రుణం ఇవ్వాలని అడిగారు. సదరు సిబ్బంది మీ గ్రూపునకు సంబంధించి రూ.28,600 కట్టాల్సి ఉందని చెప్పారు. దీంతో షాక్‌కు గురైన నూకరత్నం సెప్టెంబరు నె7వ తేదీన మొత్తం సొమ్మును చెల్లించామని రసీదు చూపించింది. ఖాతా తనిఖీ చేయగా అందులో సొమ్ము చెల్లించినట్టు లేదు. దీంతో బ్యాంకు సిబ్బందిని ప్రశ్నించగా తమకు సంబంధం లేదని, ఎంతోమంది రోజూ బ్యాంకు వస్తారని చెప్పారు. సొమ్ము చెల్లించిన తేదీని చెప్పడంతో బ్యాంకులో ఉన్న సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా నూకరత్నం నుంచి సొమ్ము తీసుకున్న వ్యక్తిని గుర్తించారు. తమకు న్యాయం చేయాలని బ్యాంకు అధికారికి, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆమె తెలిపారు.

మోటార్ సైకిల్ ఢీకొని బాలుడి మృతి

మృతికి కారణమైన మరో బాలుడిపై కేసు నమోదు


మృతి చెందిన మహేష్ శ్రీహర్ష (ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురం మండలం పేరూరు శివారు తలుపులమ్మ తోట వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన దొంగ మహేష్ శ్రీహర్ష (11) మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలుడు వేరొకరి మోటారు సైకిల్‌ని తీసుకుని వేగంగా నడుపుతూ సైకిల్‌పై వస్తున్న మహేష్ శ్రీహర్షను ఢీకొట్టి అతని మరణానికి కారణమయ్యాడని అమలాపురం పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ తెలిపారు. అమలాపురంలోని ప్రైవేటు స్కూలులో ఆరో తరగతి చదువుతున్న మహేష్ శ్రీహర్ష రోజూ సాయంత్రం గ్రామంలో ట్యూషన్‌కు సైకిల్‌పై వెళ్లి రాత్రికి ఇంటికి తిరిగి వస్తూ ఉంటాడు. మంగళవారం రాత్రి 7.45 గంటల సమయంలో ట్యూషన్ నుంచి తన సహచర విద్యార్థులు ఇద్దరితో కలిసి వేర్వేరుగా సైకిళ్లపై వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మహేష్ శ్రీహర్షను మోటారు సైకిల్ బలంగా ఢీకొట్టడంతో అతని తలకి తీవ్ర గాయమై మృతి చెందినట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన దొంగ సత్యరాము (చిన్నా) తన మోటారు సైకిల్‌ను డ్రైవింగ్ లైసెన్స్ పొందే అర్హత కూడా లేని 16 ఏళ్ల బాలుడికి ఇచ్చాడు. ప్రమాదానికి కారణమైన మైనర్ బాలుడిపైన, మోటారు సైకిల్ ఇచ్చిన దొంగ చిన్నాపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రాంతి కుమార్ తెలిపారు.

మార్కెట్‌లోకి కియా ఈవీ 6 కారు



కారును విడుదల చేసిన కంటిపూడి సర్వారాయుడు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని కంటిపూడి కియా షోరూంలో బుధవారం కియా ఈవీ6 కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు మాట్లాడుతూ ఫుల్ డ్యూయల్ మోటార్ సిస్టమ్‌తో సరికొత్త కియా ఈవీ6 కారు రూపొందించారన్నారు. కేవలం 5.2 సెకన్లలో 100 కేఎంపీహెచ్ వేగాన్ని చేరుకుంటుందని, అల్ట్రా ఫాస్ట్ చార్జింగ్ ద్వారా కేవలం 18 నిమిషాలలో 10 శాతం నుంచి 80 శాతం చార్జింగ్ చేసుకోవచ్చునన్నారు. ఒక్క ఫుల్ చార్జ్‌తో 708 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చన్నారు. ఇంటెలిజెంట్ సేఫ్టీ లెవెల్ 2, 8 ఎయిర్ బ్యాగ్స్ తదితర అత్యాధునిక సేఫ్టీ ఫీచర్లు ఈ కారులో పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో కంటిపూడి గ్రూప్ డైరెక్టర్ కె.వినయ్‌బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణమూర్తి (చిన్నబాబు), కె.మన్మోహన్‌రామ్, ఎస్‌బీఐ ఆర్‌ఎం టి.శ్రీనివాసరావు, బ్యాంక్ ఆఫ్ బరోడా డిప్యూటీ ఆర్‌ఎం వి.శ్రీనివాసరావు, జీఎం కామేష్ పాల్గొన్నారు.